'బీసీ అభ్యర్థి కాసానిని గెలిపించుకుందాం'

శంషాబాద్: బీసీ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించుకుందామని బీసీ నాయకుడు కౌన్సిలర్ మేకల వెంకటేశ్ ముదిరాజ్ అన్నారు. సిద్ధాంతిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ అభ్యర్థిగా ఉన్న కాసాని గెలుపుపై అనుచితంగా మాట్లాడుతున్న వారికి ఈ గెలుపు ఓ గుణపాఠంగా మారాలన్నారు. గతంలో ఎంపీగా పనిచేసిన వ్యక్తి స్థానికంగా చేసిన వాగ్దానాలను కూడా మరిచిపోయాడని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని పేర్కొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

బండ్లగూడ: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రపై చర్యలు కోరుతూ కార్పొరేషన్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ రంగారెడ్డి కలెక్టర్‌తో పాటు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడ్ ఉండడంతో అధికారులు ప్రజా ప్రతినిధులతో ఎలాంటి సమావేశాలు, సభల్లో పాల్గొనే వీలు లేదన్నారు. అయినప్పటికీ మార్చి 26వ తేదీన కార్పొరేషన్‌కు చెందిన డిప్యూటీ మేయర్‌తో పాటు కార్పొరేటర్లు కమిషనర్‌ను కలిసి తాగు నీటి సమస్య, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై వివరించారు. ఈ విషయమై మరుసటి రోజు మార్చి 27వ తేదీన పలు పత్రికల్లో ప్రచురితం సైతం అయిందన్నారు. కోడ్ సమయంలో అభివృద్ధి పనులపై ఎలాంటి సమావేశాలు చేయవద్దన్నారు.

టెన్త్ టాపర్ విద్యార్థికి చెక్కు అందజేత



టాపర్ విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మైలార్‌దేవ్‌పల్లి: పదో తరగతి ఫలితాల్లో రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ పయోనీర్ కాన్సెప్ట్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మొత్తం 85 విద్యార్థులకు గాను 25 మంది 9 జీపీఏ అంతకంటే ఎక్కువ సాధించారు. చింతకింది శశాంక్ 10 జీపీఏతో పాఠశాల టాపర్‌గా నిలిచాడు. దీపికానాయక్ 9.8 జీపీఏ సాధించాడు. టాపర్‌గా నిలిచిన శశాంక్‌కు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సాకేత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ త్రిప్తి పాటిల్, బత్తుల సుధీర్ రూ. 10 వేల చెక్కును అందజేశారు.

మే డే ను ఘనంగా జరుపుకోవాలి



మణికొండ: మున్సిపాలిటీల్లో మే డే వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మల్లేశ్ పిలుపునిచ్చారు. మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీల్లో మే డే పోస్టర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు తమ హక్కుల కోసం పోరాడటంతో పాటు తమ దినోత్సవంగా మే 1వ తేదీని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకరయ్య, స్వామి, శ్రీకాంత్, నరసింహ, కార్మికులు పాల్గొన్నారు.

ఊపందుకుంటున్న ప్రచారం


కోకాపేటలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో పార్టీల ప్రచారం జోరందుకుంటున్నది. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భార్య సంగీతారెడ్డి మణికొండ రెడ్డి సంఘంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. తన భర్తకు మద్దతు ఇచ్చి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీహెచ్. భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో, ఖానాపూర్‌లో కౌన్సిలర్ జి. అమరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పి. కిషన్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు



మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి నివాసంలో మంగళవారం ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రంజిత్‌రెడ్డికి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలంపై అవగాహన ఉందన్నారు. ఆయన గెలుపునకు కృషి చేయాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్‌కు రాజీనామా చేశానని పేర్కొన్నారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి, మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

పదిలో సర్కార్ సత్తా

ఫలితాల్లో మెరుగైన జీపీపీ సాధించిన విద్యార్థులు

అభినందించిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులు


డి.హర్షిత 10 జీపీఏ


వి.ప్రవళిక 10 జీపీఏ

శంషాబాద్ రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 84 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా పాల్మాకుల మోడల్ స్కూలులో 95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర శంషాబాద్ పాఠశాలలో 94 శాతం, శంషాబాద్ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల 90 శాతం, తొండుపల్లి, నర్కూడలో 88 శాతం, పెద్దతూప్రలో 85 శాతం, పాల్మాకులలోని కేజీబీవీ స్కూల్, మల్కారంలో 82 శాతం, శంషాబాద్ బాలుర పాఠశాల, పెద్దషాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో 79 శాతం, రామంజాపూర్‌లో 77 శాతం, సాతంరాయిలో 76 శాతం, పాల్మాకులలో 68 శాతం, చిన్నగోల్కొండలో 67 శాతం ఉత్తీర్ణులయ్యారు.

ఇద్దరికి 10 జీపీఏ మార్కులు..

పాల్మాకులలోని మోడల్ స్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు 10 జీపీఏ మార్కులు సాధించారు. 31 మంది 9 జీపీఏ కంటే ఎక్కువ మార్కులు పొందారు. 10 జీపీఏ సాధించిన వారిలో డి.హర్షిత, వి.ప్రవళిక ఉన్నారు.

శ్రీ శారదా విద్యామందిర్‌లో వందశాతం..

శంషాబాద్: పట్టణంలోని శ్రీ శారదా విద్యామందిర్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఇద్దరు నిరుపేద విద్యార్థులు ఎన్. చాందిని, కె. నవీన్ 10 జీపీఏ సాధించారని కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి భవిష్యత్‌కు భరోసాగా ఉంటామని పేర్కొన్నారు.

అత్తాపూర్ భాష్యం స్కూల్ విద్యార్థుల సత్తా..

రాజేంద్రనగర్: అత్తాపూర్ భాష్యం స్కూల్‌కు చెందిన 11 మంది విద్యార్థులు 10 జీపీఏ, మరో ఏడుగురు విద్యార్థులు 9.8 జీపీఏ సాధించారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల జేఈఓ అంకమ్మరావు మాట్లాడుతూ.. విద్యార్థుల నిరంతర శ్రమ, ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధతో ఈ ఫలితాలు సాధించగలిగామన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ అయ్యూబ్ భాషా, వైస్ ప్రిన్సిపాల్ లౌక్య అభినందించారు.

అత్తాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు..

అత్తాపూర్: అత్తపూర్ జడ్పీ పాఠశాలలో ఉత్తమ జీపీఏ సాధించిన 10 మంది విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత అభినందించారు. ఉన్నత చదువులు చదివి పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని ప్రధానోపాధ్యాయురాలు ఆకాంక్షించారు.

మైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ పాఠశాల..

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గణేశ్ నగర్ జడ్పీ పాఠశాలలో 51 మందికి 45 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులో పి సిరి 9.3 జీపీఏ, మమత 9.0 వర్ష 9.0 సాధించింది. మైలార్‌దేవ్‌పల్లి జడ్పీ పాఠశాలలో 139 మందికి 101 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఏ గీత 9.5, కె రోహిత్ 9.3, కె మౌనిక 9.2, కె మల్లిక 9.2, జి పల్లవి 9.2 సాధించారు. పద్మశాలిపురం జడ్పీ పాఠశాలలో 78 మందికి 49 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులో హరినాథ్ 9.0, యస్వంత్ 8.7, అశ్విత 8.7 సాధించారని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

నార్సింగి గురుకులంలో 100 శాతం..

మణికొండ: రాష్ట్రంలో మంగళవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో సాంఘిక సంక్షేమ శాఖ నార్సింగి గురుకుల పాఠశాల బాలికలు సత్తా చాటారు. మొత్తం 82 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 100 శాతం ఫలితాలు సాధించారు. వారిలో ఆరుగురు 10 జీపీఏ సాధించి గండిపేట మండలంలో అగ్రస్థానంలో నిలిచారు. 10 జీపీఏ సాధించిన వారిలో ఎస్.శ్రీజిక, ఎ.సాయివైష్ణవి, వై.సాత్విక, బి. మహేశ్వరి, ఎస్.అశ్రిత, ఎ.సాహితీ ఉన్నారు. కిస్మత్‌పూర్‌లోని కస్తూర్బా గాంధీ విద్యాలయానికి చెందిన 41 మందికి 40 మంది ఉత్తీర్ణులయ్యారు. మణికొండ ప్రభుత్వోన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో 204 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 177 (87శాతం) మంది పాస్ అయ్యారు. వారిలో డి.కుష్వంత్ రామచంద్ర వర్మ 10 జీపీఏ, ఎస్. భార్గవి, ఎం. మిర్యామి 9.8 జీపీఏలు సాధించారు. నార్సింగి ప్రభుత్వోన్నత పాఠశాలలో 160 మందికి 131 మంది (82శాతం) ఉత్తీర్ణులయ్యారు. హైదర్‌షాకోట్ ప్రభుత్వోన్నత పాఠశాలలో 87 మంది పరీక్షలు రాయగా 52 (60శాతం) మంది, వట్టినాగులపల్లి ఉన్నత పాఠశాలలో 16 మందికి 9 (56శాతం), కోకాపేటలో 43 మందికి 24 (56శాతం), గండిపేట మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 633 మంది విద్యార్థులకు 515 (77శాతం)మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.


10 జీపీఏ సాధించిన నార్సింగి గురుకుల పాఠశాల విద్యార్థినులు




కుష్వంత్ రామచంద్ర వర్మ, 10 జీపీఏ


భార్గవి 9.8 జీపీఏ


మిర్యామి 9.8 జీపీఏ


ఫిర్దోస్ బేగం (9.3)


సి.అరవింద్ (8.8)


ఎస్.జయ (8.7)


చాందిని 10 జీపీపీ


కె. నవీన్ 10 జీపీపీ

రంజిత్‌రెడ్డిని గెలిపించుకోవాలి


కిస్మత్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఇంటింటా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: చేవెళ్ల గడ్డపై ఎంపీగా మరోసారి రంజిత్‌రెడ్డిని గెలిపించుకోవాలని తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో డివిజన్ అధ్యక్షుడు ఎన్ ధనంజయ్ ఆధ్వర్యంలో శ్రీరామ్‌కాలనీ, బుద్వేల్, రైల్వేస్టేషన్ కాలనీలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కో ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్రంలో అమలవుతున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. అనంతరం జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. చేవెళ్ల అభివృద్ధి సాధించాలంటే రంజిత్‌రెడ్డి గెలుపు ఎంతో అవసరం తెలిపారు. కార్యక్రమంలో సానెం శ్రీనివాస్ గౌడ్, ఖలీద్, కవిత రెడ్డి, గోపాల్, శ్రీనివాస్ గుప్తా, బ్రహ్మచారి, పి గోపాల్, నరసింహయాదవ్, ఇ సతీశ్, కిశోర్, సునీత, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్ డివిజన్‌లో..

అత్తాపూర్ : కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి కోరారు. అత్తాపూర్ డివిజన్‌లోని రాంబాగ్, వీకర్ సెక్షన్, బస్తీల్లో మంగళవారం ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేశ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ధన్ పాల్ రెడ్డి, భాస్కర్, నాగరాజు, మధురెడ్డి, సత్తిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజు, కృష్ణ, శివారెడ్డి, నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

బండ్లగూడ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏ-బ్లాక్ అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో కిస్మత్‌పూర్ తదితర ప్రాంతాల్లో నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటే మరింత ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం వస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేఎంసీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు చంద్రశేఖర్, శ్రీనాథ్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, నాయకులు ప్రేమ్‌గౌడ్, నరేందర్, టింకురెడ్డి, రాజిరెడ్డి, సంగారెడ్డి, ఖాజా, గంగని హరికృష్ణ, సదానంద్, నవీన్, సందీప్, వినయ్‌రెడ్డి, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి


న్యాయవాదులతో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజేంద్రనగర్ అసెంబ్లీ లీగల్ సెల్ కన్వీనర్ మిద్దె సుదర్శన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అడ్వకేట్ ప్రొడక్షన్ యాక్ట్, శాశ్వత కోర్టు భవనం నిర్మాణానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, రాజు గౌడ్, ప్రసాద్ రెడ్డి, కొంగ్ల నవీన్, కోరని క్రాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

చేవెళ్లలో గెలిచి రికార్డు సృష్టించాలి

రాజేంద్రనగర్: చేవెళ్ల ఎంపీ ఎన్నికల్లో గెలిచి చరిత్ర సృష్టించాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఇందిరా ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ మహిళా మోర్చా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే వారం చేవెళ్ల పార్లమెంట్ మహిళా సదస్సును నిర్వహించనున్నట్లు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని సూచించారు. సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి వనితారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు నాగమణి, డాక్టర్ అనురాధా, డివిజన్ అధ్యక్షుడు బాబురావు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు డి పద్మావతి, ఉమా, శివలీల, కుమారి, సరితారెడ్డి, స్వప్నరెడ్డి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

మణికొండ: గండిపేట మండలకేంద్రంలోని శ్మశానవాటిక, దేవాదాయ, మసీదు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని గండిపేట మాజీ సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక బీఆర్ఎస్ నాయకులు గోపాల గణేశ్, ప్రశాంత్ సర్వేనంబర్ 16లోని శ్మశాన వాటిక భూమిని పంచాయతీ లే అవుట్ ప్రకారం రోడ్డుగా చూపిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అలాగే సర్వే నంబర్ 35, 38, 39 లో రోడ్డు వేయనివ్వకుండా అడ్డుకుని దేవాదాయ, మసీదు భూములు కబ్జా చేస్తున్నారని పేర్కొన్నారు. సర్వే నంబర్ 64లో ప్లాటుగా చేసి ఇంటిని నిర్మిస్తున్నారని వాటిని కూల్చేసి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని లేకుంటే, రానున్న రోజుల్లో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో నర్సింగ్‌రావు, మహ్మద్ నసీర్, హఫీజ్ తదితరులు ఉన్నారు.



ఓటు వేయడం మన బాధ్యత



ఓటు హక్కు అవగాహనలో పాల్గొన్న అధికారులు, కాలనీ సంఘాల నాయకులు

మణికొండ: ఓటు హక్కు వినియోగించుకోవడం మన బాధ్యతని స్వీప్ నోడల్ అధికారి, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి. ఆంజనేయులు అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీ పార్కులో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో 70 నుంచి 80 శాతం ఓటింగ్ జరిగేలా ప్రతి కాలనీలో ప్రచారం నిర్వహిస్తామన్నారు. ప్రజలు కూడా తమ హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకుని వాటిని నిర్వర్తించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. చదువుకోని వారు 100 శాతం ఓటింగ్‌లో పాల్గొంటే చదువుకున్న వారు 40 శాతం మాత్రమే ఓటింగ్‌లో పాల్గొనడం సిగ్గు చేటన్నారు. ఈసారి దానిని రూపుమాపి కనీసం 80 శాతం ఓటింగ్‌లో పాల్గొని చైతన్యాన్ని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు కాంతారావు, దిలీప్ కక్కడ్, వంశీ, జార్జ్‌క్రిష్టి, శ్రీనివాస్, శానిటరీ ఇన్‌చార్జి నరేశ్, ఈఈ సంపత్ పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయ

రిజిస్ట్రార్ ఉద్యోగ విరమణ



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం వెంకరమణ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. విధుల్లో భాగంగా వ్యవసాయ రంగానికి, రైతాంగానికి తనకు సాధ్యమైన మేర సేవలు అందించానని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బంది ఆయనను సత్కరించారు. రిజిస్ట్రార్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం సూపరింటిండెంట్ శ్రీనివాస్, ఆఫీస్ సబార్డినేట్ కే సామయ్య కూడా విరమణ చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా రఘురామిరెడ్డి ప్రస్తుత రిజిస్ట్రార్ వెంకటరమణ విరమణ చేయడంతో ఇదే విశ్వవిద్యాలయంలో పరిశోధనా సంచాలకుడిగా పని చేస్తున్న రఘురామిరెడ్డిని ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమిస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ఎం రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

నార్సింగి కౌన్సిలర్ శ్రీకాంత్ దంపతుల అరెస్ట్



మణికొండ: నకిలీ పత్రాలు సృష్టించి ఓ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి రూ.3.13 కోట్లు తీసుకుని మోసం చేశారనే కేసులో నార్సింగి మున్సిపాలిటీ ఆరో వార్డు కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు, ఆయన భార్య ప్రేమలత, నార్సింగికి చెందిన డి.శివరాజును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రంగారెడ్డి జిల్లా గండిపేట్ నెక్నాంపూర్‌కు చెందిన శ్రీనివాస్‌రావు, సూర్యారావు ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు. నార్సింగి పరిధిలోని సర్వే నంబర్ 298లో 30 ప్లాట్లు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసి సూర్య డెవలపర్స్‌ను మోసం చేసినట్టు సమాచారం. దాంతో సూర్య డెవలపర్స్ యజమాని శ్రీనివాస్‌రావు పోలీసులను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన వారు ఈ కేసును ఈఓడబ్ల్యూకి బదిలీ చేశారు. వారు సమగ్రమైన విచారణ చేపట్టారు. మోసం చేసినట్టు నిర్ధారించిన పోలీసులు కౌన్సిలర్ శ్రీకాంత్‌రావుతో పాటు అతడి భార్య ప్రేమలత, వీరికి సహకరించిన శివరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.